# చుట్టమై చూడొచ్చి...

"వేళగాని భోజనం. ఆకలిగా లేదుకూడా" అన్నాడు బలరాం పీటమీద కూర్చుంటూ. "ఫర్వాలేదు లేద్దురూ. ఈ ఒక్క పూటకే గదూ. ఆకలైనంతవరకే తినండి. వచ్చే సరికి పన్నెండు దాటుతుంది. అప్పుడెలా తింటాం" అంది అమల పళ్ళెంలో అన్నం పెడుతూ.

"ఏమిటే అన్నం యిలా ఎర్రగా వుంది," అన్నాడు బలరాం అన్నం చేతిలోకి తీసుకొంటూ.

"మొన్న సరళ శేరు బియ్యం బదులు తీసుకెళ్ళి యివ్వాళ దంపుడుబియ్యం తెచ్చిచ్చింది. వాళ్ళింట్లో దంపుడు బియ్యమే వాడతారంట. మొన్న సమయానికి లేవని మన బియ్యమే తీసికెళ్ళింది" అంది అమల కూర వడ్డిస్తూ.

"ఈ దంపుడు బియ్యం ఆరోగ్యమేగానీ అన్నం మేకుల్లా వుంటుంది."

"సరేగానీ మనకు టైం సరిపోతుందా, టిక్కట్లు దొరకడం కష్టం. డైలీ సినిమాలకే రష్‌గా వుంటుంది. ఇలా ఏటికోసారి సెపరేట్ ప్రోగ్రాం వుంటే థియేటరులో కాలు పెట్టడం బ్రహ్మప్రళయం. ఐనా అంత చిన్న థియేటరులో నాట్య ప్రదర్శనేమిటే," అంది అమల తను అన్నం పెట్టుకుంటూ. బలరాం వాచీ చూశాడు "ఏడుంబావు. భోంచేసి టాక్సీ లేటయి అరగంటలో వెళ్ళి పోవొచ్చు. టికట్లు తీసి

వుంచమని కృష్ణకిచెప్పాను. ఐనా నువ్వు తొందరగా తెమలాలి"

"నా ఆలశ్యం ఏమీవుండదు. ఐదు నిమిషాల్లో రెడీ, నాట్యాలంటే నాకెంతో యిష్టం. ఈ వూళ్ళో ఎప్పుడో ఓ సారి ఏ వరదబాధితులకో, క్షామనివారణకో, ప్రోగ్రాం వుంటుందిగానీ, మా వూళ్ళో అయితే కనీసం వారానికి రెండుసార్లయినా నాట్యప్రదర్శనా లుంటాయి. సినిమాల కంటే ఎక్కువిష్టం నాకు."

"మరి నువ్వెందుకు నేర్చుకోలేదు?"

"అంతదృష్టం నా జాతకంలోలేదు. పోనీ చూసి ఆనందించటానికి అవకాశాలుంటే చాలు. ఇంతకీ మనం మాటల్లో బడి ఆలస్యం చేస్తున్నాం."

"మరేం ఫర్వాలేదు. కావలసినంత టైముందిగానీ, ఏ చీర కట్టుకుంటావ్? వైటేనా?"

"అవును. నైట్ డ్రెస్ వైటేగదా. సరిగా తెలుపు చీర, నలుపు చోళీ తీసిమంచంమీద పెట్టి వచ్చా. రోసానే సాయెబు రొట్టెన్నర తిన్నాడని, వేళగాని వేళంటూనే గిన్నెలు ఖాళీచేశాం" నవ్వింది అమల చెయ్యికడుక్కుని లేస్తూ.

"మరి మూడు గంటలసేపు కుర్చీలో కూర్చోటానికి ఓపికుండొద్దూ? అదీగాక నువ్వొండిన వంకాయకూర."

"బలరామం" "ఏవోయ్ బలరామం" వీధిలోంచి కేకలు వినపడ్డాయ్.

"ఎవరో మీ ఫ్రెండుగారు. కబుర్లేసుకు కూర్చోకతొందరగా తెమలండి. ఇంతలో నేను రెడీగావుంటాను" అంది అమల వెళ్తున్న బలరాం నుద్దేశించి.

*  *  *

అమల బట్టలు కట్టుకొని అద్దంముందు నుంచుని స్నో రాసుకొంటూంటే బలరాం హడావిడిగా లోపలికొచ్చాడు. "ఆయన ఎవరో తెలుసా? నా ఫ్రెండుకాదు. నీ చుట్టం. మీ రెండో వదిన పెదతండ్రి రామనాథంగారు. ఏదో పనిమీదవచ్చారట. పొద్దుపోయిందని, ఈ రాత్రికుండి వెళ్ళిపోవచ్చని యిక్కడికి వొచ్చారట. ఎలా మనంవెళ్ళేది? ఆయనకి భోజనం పెట్టొద్దూ?" అమల గతుక్కుమంది మొహం ముడుచుకుపోయింది.

"వేళాపాళాలేదు చుట్టాలు రావటానికి." విసుక్కుంది.

"అందుకే అతిథి అన్నారు."

"బావుంది మీ వరస. గృహస్థులు మీ రుండిపోయి ఆ అతిథిని రిసీవ్ చేసుకోండి." రుసరుసలాడింది అమల.

"నాకేం? ఆయన నీ చుట్టమే. దానికేంగానీ, యింకో అరగంట టైముంది. ఒక్క అరసోలెడుబియ్యం పావుగంటలో వండలేవూ? కూరలున్నాయిగా. మహాఅయితే టెన్ మినిట్స్ లేటవుతుంది. మానుకోనక్కర్లేదు. ఏమంటావ్?"

అమల మొహం కొంచెం విప్పారింది. "లేకపోతే ఏం బావుంటుందండీ? మొదట్లో చక్కటి ప్రార్థనాగీతం ఎంతబావుం టుంది! వినే అదృష్టంలేదు" విచారించింది అమల.

"ముందు ఆయన్నోసారి పలకరించుదువుగాని రా. ఇలా విచారిస్తూ కూర్చుంటే—" అమల గబగబా వీధిగది లోకి నడిచింది. ఆ ముసలాయన కుర్చీలో కూర్చుని ఏదో పుస్తకం తిరిగేస్తున్నాడు. కుర్చీపక్కన గొడుగూ సంచీ వున్నాయి.

"అంతా బావున్నారా మావయ్యగారూ? మీరిదేనా రావటం?" అంటూ నవ్వు తెచ్చుకొని పలకరించింది. ఆయన అమలకేసి చూస్తూ "బాగానే వున్నారమ్మాయ్. వచ్చినపని అవక ఈ పూటకి వుండిపోవలసివచ్చింది." నొచ్చుకుంటున్న ట్టుగా అన్నాడాయన.

"దానికేమండీ? ఇదేం యిల్లుగాదా? మీ అమ్మాయి యిల్లే అనుకోండి," భర్తకేసి చూస్తూ "మీరు మావయ్య గారితో మాట్లాడుతూండండి. నే లోపలికెళ్తాను" అని వంట గదికేసి నడిచింది. "చీర మార్చుకొని వంటచేస్తే? ఆఁ అర గంట భాగ్యానికి విప్పి కట్టా లెంవేస్టు. అన్నమేకదూ ఎంతలో వుడుకుతుందీ?" అనుకొంటూ పొయ్యిరాజేసి ఎసరు పెట్టింది. "చక్కగా యీపాటికి వెళ్తూవుందుము. జనం కిట కిటలాడుతూ వుంటారు. రతీమన్మథనృత్యం ఎంతబావుంటుందీ! అది మొదటేకూడా. చూస్తానోలేదో, అదృష్టంకూడా వుండాలి. పాపం పొయ్యి గమ్మునే అంటుకొందిలే." అమల

చెవుల్లో గజ్జెలు ఘణఘణ మ్రోగుతోంటే బుర్ర ఆలోచనల్తో నిండిపోతూంది.

*　　*　　*

"లేవండి మామయ్యా. కాళ్ళు కడుక్కొని భోంచేద్దురుగానీ." అంది అమల వీధి గదిలోకొచ్చి.

"అబ్బే. ఎందుకమ్మాయ్ నీకా శ్రమ? రేపుదయం భోంచెయ్యొచ్చు. ఈ పూటకి ఫర్వాలేదులే అమ్మాయ్" అన్నాడాయన.

"అలా అనకండి. ఇంటికొచ్చిన చుట్టానికి భోజనం పెట్టటానికి శ్రమేంటి బాబాయ్? అటువంటి శంక లేమీ పెట్టుకోకుండా భోంచెయ్యండి." అన్నాడు బలరాం.

"అదిగాదు నాయనా! మామూలుమనిషినైతే శ్రమేముందిలే. వెధవగొడవ. క్రింద ఏడాది చచ్చే జబ్బుచేసింది చూశావ్, అప్పట్నుంచీ పత్యంగా తింటున్నాను దంపుడు బియ్యం అన్నంగాని పనికిరాదు. వంకాయ, ఆవకాయ, లాంటివి వాడటంలేదు. వాలాజీ తాలింపు కుదర్నే కుదరదు అందుకేగదూ, ఎప్పుడూ యిల్లు కదల్ను నే నిబ్బందిపడి యితర్ల నిబ్బందిపెట్టాలి. హోటలు మెతుకులు వాసన చూస్తేనే జబ్బు తిరగబెడుతుంది. ఈ రాత్రిపూట మీరేం శ్రమపడతారు నాయనా నాగురించి?" అన్నాడాయన దిగులుగా. ఆయన మాటలు వింటూ బలరాం స్తంభించిపోయాడు. అమల గుండె ఆగిపోయింది. ముసలాణ్ణి నమిలి మింగేద్దా

మన్నంత కోపంవచ్చింది. పత్యాలూ, పానాలూ వున్నవాళ్లు పొరుగిళ్ళ కెందుకురావాలో? పానకంలో పుడకలాగ. చిరాకుగా లోపలికెళ్ళిపోయింది అమల. బలరాంకూడా నెమ్మదిగా లోపలి కొచ్చాడు.

అమల మంచంమీద కూర్చునివుంది మూతిముడుచుకొని.

"అన్నం వండావుకదూ? నిమ్మకాయ పచ్చడుంది. చారుంది. పెరుగుందికదూ ... ?" అన్నాడు నెమ్మదిగా బలరాం.

"అన్నంమాత్రం ఏదీ? దంపుడన్నం మేకుల్లా గట్టిగా వుంటే ముసలాయన తినలేడేమోనని మరబియ్యమేవండాను." అంది అమల.

బలరాంకి నవ్వొచ్చింది. అదిచూసి అమల కేడుపొచ్చింది.

"నాఖర్మ. లేకపోతే ఈపాటికి థియేటర్లో కూర్చుని వుండవలసినదాన్ని...చుట్టమై చూడొచ్చి దెయ్యమై పట్టుకొందని ... నా కదృష్టంలేదు" అంది భారంగా అమల. బలరాం అమల పక్కన కూర్చున్నాడు "చూడమలా! ఆయనేం గతిలేక మనింటికి రాలేదు. అనవసరంగా మనకి శ్రమస్తున్నానని ఎంతో నొచ్చుకొంటున్నాడు. ఇదే వాళ్ళమ్మాయయితే యిలా విసుక్కొనేదా? మనం పెడితే తింటాడు. లేకపోతే పస్తుంటాడు. మర్యాదగల పెద్దమనిషింటికొస్తే ఎలా పస్తుపడుకోబెడతాం? డాన్సులు యివ్వాళ

కాపోతే రేపుంటాయి. ఆ భాగ్యానికి మంచీ మర్యాదా లేకుండా ఎలా?"

"ఇప్పుడు నన్నేం చెయ్యమంటారు?"

"లేచి అన్నంవండు. నేనలా బజారుకెళ్ళి బీరకాయలైనా, ఏవైనా తీసుకొస్తాను. కాస్త నెయ్యి తాలింపేసి కూరవండొచ్చు. లేమరి. ఎనిమిది దాటిపోయింది."

అమల మాట్లాడకుండా వంటగదిలోకెళ్ళింది. బలరాం కూరగాయలసంచి తీసుకొని వీధిలోకి నడిచాడు.

*  *  *

తెల్లవారింది. అమలకి రాత్రంతా సరిగా నిద్రపట్ట లేదు. పట్టినా ఏ రతీమన్మధులో, ఉమాశంకరులో, రాధా కృష్ణులో నాట్యంచేస్తూ లేపేసేవారు. లాభం లేదనుకొని కనుచీకటుండగానే లేచిపోయింది. ముసలాయన మూడుగంట లకే లేచి కూర్చున్నాడు. అమల ఆయనకోసం నీళ్ళు కాచి స్నానానికి తోడింది. కాఫీ తాగడని తెలుసుకొని, అప్పుడే పాలమనిషి తెచ్చిన పాలు కాచియిచ్చింది. "బలరాం లేవ లేదమ్మా?" అన్నాడాయన పాలగ్లాసందుకొంటూ.

"లేదు మామయ్యా! లేపమంటారా?"

"అతనే లేస్తాడులే. పనేంలేదు. వెళ్ళిపోయే ముందు చెప్దామని."

"ఇంత పొద్దుటే ఎక్కడికెళ్తారు? భోంచేసివెళ్దురుగాని."

ఆయన చిన్నగా నవ్వుతూ గ్లాసు క్రిందబెట్టి జేబు లోంచి కొన్ని నోట్లుతీసి అమల కందిస్తూ "ఇవి వుంచు

కోమ్మా" అన్నాడు. అమల ఆశ్చర్యపోయింది "నాకు డబ్బెందుకు మామయ్యా?" అంది—"ఇది డబ్బనుకోకమ్మా. సంతోషంగా యిస్తున్నాను. అర్థరాత్రి వచ్చినా కన్నతండ్రికి చేసినట్టు చేశావు. నీ ఋణం ఎలామర్చిపోను? నా కూతురైతే యిచ్చుకోకుండా వెళ్తానా. తీసుకోమ్మా. నీకు నచ్చిన చీర కొనుక్కో—? నేనే చీరకొని తెస్తే తీరా నీకునచ్చకపోతే...అందుకని నువ్వేకొనుక్కో—" అంటూ ఆయనా నోట్లు అమలచేతిలో పెట్టాడు. అమల తలవంచుకొని తదేకంగా ఆలోచిస్తోంది. బలరాం ఆవలిస్తూ బయటకొచ్చాడు. "వెళ్తున్నానోయ్ బలరాం. ఒకతనితో మాట్లాడి మెయిల్ కెళ్ళిపోతా. వీలు చూసుకొని మాయింటి కోసారి రండి. వస్తానమ్మా అమలా" అంటూ ఆయన సంచీ గొడుగూ పట్టుకొని వీధిలోకి నడిచాడు. బలరాం మత్తువదిలించుకొని "అదేంటి బాబాయ్. అప్పుడేవెళ్తున్నారు? స్టేషన్కొస్తా నాగండి" అంటూ వెంబడించాడు.

"వద్దు నాయనా. ఇప్పు డెళ్ళకపోతే అతను దొరకడు. ఫర్వాలేదులే. వెళ్తా" అంటూ ఆయన చరచరా వెళ్ళిపోయాడు. బలరాం లోపలికొచ్చాడు. అమల అలాగే నుంచునివుంది, చేతిలో ఐదుపదులు రెపరెపలాడుతున్నాయ్. అంతటి సహృదయుణ్ణి ఈసడించుకొన్నందుకు నొచ్చుకొంటూ "చుట్టమై చూడొచ్చి..." అనుకొంటూంటే కళ్ళలో నీళ్ళుతిరిగాయి.

( 2-7-53 తేదీ 'ఆంధ్రవారపత్రిక' నుంచి )